క్లుప్తంగా

దళిత, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను సన్మానిస్తున్న చింత బాబు, తదితరులు

కోదాడరూరల్ : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చింత బాబు మాదిగ సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. దళిత, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గుర్రాల శ్రీనివాస్ మాదిగ, కేదాసి మోహన్ మాదిగ ఉన్నారు.

వైభవంగా కంఠమహేశ్వరుని కల్యాణ మహోత్సవం



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో శ్రీ సురమాంబ సమేత కంఠమహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం శ్రీ సురమాంభిక సమేత కంఠమహేశ్వరస్వామి కల్యాణాన్ని వేద పండితుల మంత్రోత్సవాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జలబిందెలతో స్వామివారికి అభిషేకం చేశారు. గౌడ్‌లు బోనాలు, మందగంపలు ఎత్తుకొని వాయిద్యాలతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ నర్సింగ్ సైదులుగౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేయాలి

నేరేడుచర్ల : త్వరలో జాతీయ స్థాయిలో చేపట్టనున్న జనగణన పూర్తయ్యాక నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నేరేడుచర్ల కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. ధనుంజనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం నేరేడుచర్లలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన పార్టీ ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్, మహిళా సమాఖ్య నాయకురాలు దివ్య తదితరులు ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

గరిడేపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు రైతులందరికీ రైతు భరోసా, రుణమాఫీ అమలు చేయడం లేదని ఆరోపించారు. సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, మండల కార్యవర్గ సభ్యులు కుందూరు వెంకటరెడ్డి, పోకల అంజనేయులు, నర్సింహారావు, తిరపయ్య, పంగ సైదులు, ఈశ్వరాచారి, షేక్ నబీసాహెబ్, పీరిసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని నెమలిపురిలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రుద్రపంగు నవీన్, ఉపాధ్యక్షుడిగా కొమ్ము ముత్యాలరావు, ప్రధాన కార్యదర్శిగా బండ్ల బంగారు, అధికార ప్రతినిధిగా కొమ్ము రవి, కార్యదర్శిగా రుద్రపంగు గోవర్ధన్, సహాయ కార్యదర్శిగా కొమ్ము సాయి, గౌరవ సలహాదారుగా కొమ్ము రమేష్, మరో ఎనిమిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నాయకులు కణితి ప్రశాంత్, చింత్రియాల బాల చంద్రుడు, రామారావు, రమేష్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో 16 మంది అరెస్ట్

నేరేడుచర్ల: నేరేడుచర్ల పట్టణంలో ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో ఘర్షణ పడిన 16 మందిని సోమవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపారు. సోషల్ మీడియాలో ప్రచారం జరిగినట్లుగా ఇది గ్యాంగ్ వార్, రెండు గ్రామాల మధ్య జరిగిన ఘర్షణలు కావని ఆయన అన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్‌ఐ రవీందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వర్షం.. రైతుల్లో ఆనందం

నడిగూడెం : మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. మెట్ట పంటలు సాగు చేసి రెండు వారాలుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

సమస్య తీవ్రం.. ఎందుకీ నిర్లక్ష్యం

విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం

- రోజులో ఐదారుసార్లు బంద్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పాలకవీడులోని 33 /11కేవీ సబ్‌స్టేషన్

పాలకవీడు : మండలంలో నెల రోజులుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోజులో కనీసం ఐదారు సార్లు పవర్‌కట్ అవుతుండడంతో ప్రజలు, రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ నిలిచిపోయిన ప్రతిసారి 20 నిమిషాల నుంచి అర్ధగంట పాటు తిప్పలు తప్పడం లేదని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా పాలకవీడులోని 33/ 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్య ఉంది. ఈ సబ్‌స్టేషన్ నుంచి సుమారు పది గ్రామాలకు కరెంటు సరఫరా అవుతోంది. నిత్యం ఏదో ఒకచోట విద్యుత్ సమస్య తలెత్తుతుండడంతో ఆయా ఫీడర్లకు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపడుతున్నారు. గుడుగుంట్లపాలెం ఫీడర్ పరిధిలో విద్యుత్ సమస్య ఎక్కువగా ఉంది. విద్యుత్ వచ్చి పోతుండడంతో గృహోపకరణాలు దెబ్బతింటున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ కోతపై విద్యుత్ అధికారులకు తెలిపినా వారు పట్టించుకోని దుస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు.

కానరాని మిడిల్ బ్రేకర్లు..

విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు ఫీడర్‌లో కొన్ని చోట్ల మిడిల్ బ్రేకర్లు ఉపయోగించకుండా ఆ ఫీడర్‌కు సరఫరాను సబ్ స్టేషన్‌లో పూర్తిగా నిపివేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే ఫీడర్‌కు కొన్ని చోట్ల మిడిల్ బ్రేకర్లు కూడా ఏర్పాటు చేయలేదని, దీంతో ఎక్కడ సమస్య తలెత్తినా విద్యుత్ సరఫరా ఉండడం లేదని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. సమస్య ఉన్నచోట జంపర్లు తొలగించి మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా అందుకు భిన్నంగా అధికారులు వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు..

పలు గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. అనేక ఏళ్ల క్రితం 100 మీటర్ల దూరంలో స్తంభాలు పాతి తీగలు లాగారు. అవి వేలాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పాత విద్యుత్ లైన్లతో సమస్య తలెత్తుతోంది. గాలికి విద్యుత్ తీగలు ఒకదానికి మరొకటి తగిలి షార్ట్ సర్క్యూట్‌తో సరఫరా బంద్ అవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజ్ పోతోంది. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు కూడా అనేక ఏళ్ల క్రితం ఏర్పాటు చేయడంతో సమస్య నిత్యకృతమవుతోంది. విద్యుత్ సరఫరా ఇలాగే ఉంటే వ్యవసాయ మోటార్లు కూడా దెబ్బతింటాయని, సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అంతరాయం లేకుండా చూడాలి



మా గ్రామంలో నెల రోజులుగా తరచూ కరెంటు పోతోంది. రేయింబవళ్లు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఈ విషయమై విద్యుత్ సిబ్బందిని అడిగితే నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారు. విద్యుత్ అంతరాయంతో గృహ వినియోగదారులు, వ్యాపారులు, రైతులం ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను వెంటనే పరిష్కరించి కరెంటు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి.

– దిద్దకుంట్ల పురుషోత్తంరెడ్డి, గుడుగుంట్లపాలెం

సమస్యను పరిష్కరిస్తాం

గుడుగుంట్లపాలెం ఫీడర్‌లో తరచూ కరెంటు పోతున్న మాట వాస్తవమే. గాలి వీస్తుండడంతో తీగలు ఒకదానికి మరొకటి అనుకోవడం, చెట్లకొమ్మలు తగలడంతో సమస్య తలెత్తుతోంది. సిబ్బందిని పంపించి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాం.

– వందిరి శ్రీనివాస్, ఏఈ, పాలకవీడు

మేకల అభినవ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



కోదాడరూరల్ : అభినవ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, తదితరులు



కోదాడరూరల్ : శాంతినగర్‌లో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడరూరల్ : చెస్‌లో ఏషియన్ చాంపియన్‌గా ఎదిగి కోదాడకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన మేకల అభినవ్‌ను యువ క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సూచించారు. సోమవారం అభినవ్ జయంతి సందర్భంగా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అభినవ్ తల్లిదండ్రులు మేకల అరుణ, వెంకటేశ్వర్లు, టీపీసీసీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఏపూరి తిరపతమ్మ సుధీర్, ఎంఈఓ సలీంషరీఫ్, పారా సీతయ్య, సత్తిబాబు, కోటేశ్వరరావు, బషీర్ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కోదాడరూరల్ : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం అనంతగిరి మండల పరిధిలోని శాంతినగర్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటి మాట్లాడారు. సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ నవీన్‌కుమార్, నాయకులు ఉన్నారు.

శాంతినగర్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం..

శాంతినగర్‌లో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 18 సీసీ కెమెరాలను సోమవారం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ నవీన్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, గునుకుల గోపాల్‌రెడ్డి, బుర్రా పుల్లారెడ్డి, వెంకటేశ్వరరావు, బద్దం కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

బీవీఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

బీవీఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకుడు బుర్రా ప్రమోద్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం శాంతినగర్ ఉన్నత పాఠశాలలో బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బుర్రా సుధారాణి పుల్లారెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు, గునులకు గోపాల్ రెడ్డి, కొండపల్లి వాసు, దేగ కొండయ్య, బాబు నాయక్, బుర్రా నర్సిరెడ్డి ఉన్నారు.

రూ.20 లక్షల బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ సూర్యాపేట రీజినల్ మేనేజర్ అనిల్‌కుమార్

చిలుకూరు : మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన యరమల్ల నాగరాజు ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడు గతంలో బేతవోలు ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ప్రమాద బీమా పాలసీ చేశాడు. పాలసీ క్లైమ్ కావడంతో మంజూరైన రూ. 20 లక్షల చెక్కును సోమవారం బ్యాంక్‌లో ఎస్‌బీఐ సూర్యాపేట రీజినల్ మేనేజర్ అనిల్‌కుమార్ మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ప్రమాద బీమా పాలసీ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ జిల్లా అధికారి విద్యాసాగర్, బ్యాంక్ మేనేజర్ లాల్ సింగ్, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కోదాడలో ఎస్బీఐ ఉద్యోగుల రక్తదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎస్‌బీఐ ఉద్యోగులు

కోదాడరూరల్ : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆవిర్భవించి జూలై 1తో 70 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా కోదాడ పట్టణంలోని ఆ బ్యాంకు అన్ని శాఖల ఆధ్వర్యంలో సోమవారం సంస్థ ఉద్యోగులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ రీజినల్ మేనేజర్ అనిల్‌కుమార్ హాజరై మాట్లాడారు. కోదాడలో 90 మంది ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రీజినల్ సెక్రటరీ అయితగాని మహేష్, అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ చింతపల్లి భాస్కర్, బ్రాంచ్ మేనేజర్లు జంగాల వీరస్వామి, సందీప్‌కుమార్, దవనం నరేష్, వంశీ కృష్ణ, మేకల సాయికృష్ణ, పేర్ని సూర్య తేజ, నాగిరెడ్డి, వెంకటరత్నం, చిట్టిబాబు, పవన్ శర్మ, సాయి, సౌజన్య, శైలజ, అపర్ణ, భవానీ, జావేద్‌పాషా తదితరులు ఉన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



పాలకవీడులో శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

హుజూర్‌నగర్ : భారత దేశ ఐక్యత కోసం ప్రాణాలర్పించిన గొప్ప నేత డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు దేనుమకొండ రామరాజు, జనిగల శ్రీను, టౌన్ కన్వీనర్ నాగేంద్ర చారి, టౌన్ ప్రధాన కార్యదర్శి గుండా గోపి, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

పాలకవీడులో..

పాలకవీడు : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ మండల అధ్యక్షుడు నరినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సూరోజు ఉపేంద్రచారి, లక్ష్మనాయక్, బాలు, మహేంద్రచారి, కమలనాయక్, బాలునాయక్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

మునగాలలో..

మునగాల : జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం బలిదాన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద వారు నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మైలారిశెట్టి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు భద్రంరాజు కృష్ణప్రసాద్, శ్రీనివాసరెడ్డి, వీరబాబు, రమేష్, గోవిందాచారి, సైదులు, కపిల్ పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



చిలుకూరు జెడ్పీ హెచ్ఎస్‌లో మొక్క నాటుతున్న ఎంపీడీఓ, సీడీపీఓ, విద్యార్థులు



గరిడేపల్లి : గానుగబండలో మొక్క నాటుతున్న ఎంఈవో చత్రునాయక్, తదితరులు

చిలుకూరు : యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా సోమవారం చిలుకూరు, బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఐసీడీఎస్, పోలీస్ శాఖ, మండల పరిషత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్, ఎంఈవో గురవయ్య, జీహెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ సునిత, ఉపాధ్యాయులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్స్‌పై అవగాహన

గరిడేపల్లి : మాదకద్రవ్యాల నిర్మూలనపై అందరిలో చైతన్యం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని ఎంఈవో చత్రునాయక్ అన్నారు. సోమవారం మండలంలోని గానుగబండ ఎస్సీ కాలనీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొండాయిగూడెం పాఠశాలలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. గానుగబండ ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మొక్క నాటారు. ప్రభుత్వం సరఫరా చేసిన వంట పాత్రలను పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు పిచ్చయ్య, బాలసైదిరెడ్డి, జానకిరాములు, శివరాంప్రసాద్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు వెంకమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నడిగూడెం : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ హరిసింగ్ కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నడిగూడెం మండల కేంద్రంలోని రైతు వేదిక, పరిసర ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కోదాడ, సూర్యాపేట ఎక్సైజ్ శాఖ సీఐలు ఎం.శంకర్, మల్లయ్య, స్థానిక ఎస్‌ఐ గందమళ్ల అజయ్‌కుమార్, ఎక్సైజ్ ఎస్‌ఐలు గోవర్ధన్, రామకృష్ణ, జగన్‌మోహన్‌రెడ్డి, వెన్నెల, సురేందర్ బెనర్జీ, శోభారాణి, నడిగూడెం ఏపీఓ రవీందర్, ఈసీ శ్రీనివాస్, టీఏలు, పోలీసు సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ సందీప్‌రెడ్డి అన్నారు. సోమవారం చింతలపాలెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, హెచ్ఎం, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునగాలలో..

మునగాల : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి సునీతారాణి, అంగన్‌వాడీ టీచర్లు గన్నవరపు సంధ్యారాణి, మాణిక్యమ్మ, మణెమ్మ, కమల, రూప, ఎల్లమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుల్గంబండతండాలో..

నేరేడుచర్ల : మండలంలోని పుల్గంబండతండాలో సోమవారం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్లు సంయుక్తంగా మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు వరప్రసాద్, అంగన్‌వాడీ టీచరు సైదమ్మ, గ్రామ కార్యదర్శి అరుణశ్రీ,, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

హుజూర్‌నగర్ : పోరాటాలు చేసి కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తున్నదని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్నగౌడ్ ఆరోపించారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడుఆలకుంట్ల బాలకృష్ణ, నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య, మండల అధ్యక్షుడు మేళ్లచెరువు ముక్కంటి, పట్టణ అధ్యక్షుడు పాశం రామరాజు, జిల్లా సహాయ కార్యదర్శి చింతకాయల రాము, నాయకులు సలిగంటి జానయ్య, కత్తుల రవీందర్, మద్దం నాగేందర్, పాలకూరి లాలు, చప్పిడి సావిత్రి, గడ్డం వెంకటమ్మ, శ్రీనుయాదవ్, ఏదుల నరసింహారావు, షేక్ ముస్తాఫా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సమ్మె నోటీస్ అందజేత

కోదాడరూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జూలై 9న సమ్మె చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ తెలిపారు. సోమవారం కోదాడ ఎంపీడీఓ వీవీ రాంచందర్‌రావుకు సమ్మె నోటీస్ అందజేసి మాట్లాడారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

మేళ్లచెరువు : జూలై 9న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాగుల్‌మీరా, మీరా, పరమేష్ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



మహాసభ కరపత్రం ఆవిష్కరిస్తున్న సేవాలాల్ సేనా నాయకులు

మఠంపల్లి : రాష్ట్రంలోని బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈనెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించబోయే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సేవాలాల్ సేనా జిల్లా నాయకుడు బాలునాయక్ కోరారు. సోమవారం మఠంపల్లిలో ఆ సంఘం నాయకులతో కలిసి కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మట్టపల్లినాయక్, గోపినాయక్, నరసింహనాయక్, ఆర్యానాయక్, బాలాజీనాయక్, సూక్యానాయక్, యలమందనాయక్, కాంతానాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు 25న జిల్లా స్థాయి ఎంపికలు

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్‌లలో నాల్గవ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా నమోదు చేసుకుని మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 25న సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి జి.రాంచందర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో హాజరైన విద్యార్థులకు 9 మోటార్ క్వాలిటీ టెస్టులు నిర్వహించి ఇందులో ప్రతిభ కనబరిచిన 10 మంది బాలురు, 10 మంది బాలికలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో జరిగే ఎంపికకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికకు వచ్చే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్ (ప్రస్తుతం చదువుతున్న స్కూల్ నుంచి), జనన ధృవీకరణ పత్రం, ప్రస్తుత పాస్ పోర్ట్ సైజు ఫొటోలు 5, మూడవ తరగతి ప్రోగ్రెస్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం వెంటతెచ్చుకోవాలని ఆయన తెలిపారు.

బోనాల పాట షూటింగ్‌లో సతీష్ అకాడమీ బృందం



షూటింగ్‌లో సతీష్ మ్యూజిక్ అకాడమీ బృందం

గరిడేపల్లి : మండలంలోని అప్పన్నపేట గ్రామానికి సతీష్ మ్యూజిక్ అకాడమీ బృందం తెలంగాణ బోనాల పాట షూటింగ్‌లో అలరించారు. బిగ్‌బాస్ నటుడు భోలే, తెలంగాణ జానపద డ్యాన్సర్లు వర్షిణి, పూజ నాగేశ్వరితో సూర్యాపేట జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ గ్రామంలోని బంగారు మైసమ్మ దేవాలయంలో జరిగిన బోనాల పాట షూటింగ్‌లో వీరు పాల్గొన్నారు. కార్యక్రమంలో సతీష్ మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అమరవరపు సతీష్, బృందం సభ్యులు కల్పన, వీరబాబు, నాగమణి, అనురాధ, శోభన్, రాణి, సంధ్య, వెంకట్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

హుజూర్‌నగర్ : మండలంలోని మర్రిగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన ఆశ వర్కర్ గల్లా జానకి అందజేసిన టై, బెల్టులను సోమవారం ఎంఈఓ సైదానాయక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మీరావలి, ఉపాధ్యాయులు రాంబాబు, సీఆర్పీ బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని మున్సిపల్ చైర్మన్ యడవల్లి అశోక్‌రెడ్డి అన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపాలిటీలోని 7వ వార్డులో తడి, పొడి చెత్త వేరు చేయుట, ఎరువుల తయారీ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులకు మాటిచ్చారు.. ఆటో సౌకర్యం కల్పించారు

మఠంపల్లి : పిల్లలను తమ పాఠశాలలో చేర్పిస్తే రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఆటో సౌకర్యం కల్పిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు అల్లీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. అల్లీపురం జడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న కాల్వపల్లి తండా, కొత్తతండా, పాతతండాకు చెందిన విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఆటో పెట్టామని, విద్యార్థులకు ఈఏడాదంతా ఆటో సౌకర్యం కలిస్తామని హెచ్ఎం, ఉపాధ్యాయులు తెలిపారు. సోమవారం ఆటోకు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వినూత్నంగా బడిబాట ప్రచారం చేసి మాట్లాడారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

గరిడేపల్లి : మాసశివరాత్రి సందర్భంగా మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గల శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం స్వామివారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు రాయప్రోలు భద్రయ్య శర్మ, శ్రీరామయ్య శర్మ.. మహాన్యాస పూర్వకంగా ఏకదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమ పూజ, నవవిధ హారతులు, విశేష పుష్పాలంకరణ, శ్రీలక్ష్మి గణపతి రుద్ర, నవగ్రహ, వాస్తు హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జుట్టుకొండ చంద్రయ్య, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ



చిన్నారి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న కార్యదర్శి, టీచర్లు, తదితరులు

మఠంపల్లి : మండలంలోని అల్లీపురం అంగన్‌వాడీ కేంద్రానికి స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎన్.నరేందర్‌రెడ్డి సోమవారం సుమారు రూ.10 వేల విలువ గల కరెంట్ సామను, ఫ్యాన్లు, లైట్లు, కుర్చీలు, పిల్లలకు పలకలు అందజేశారు. తన కుమార్తెను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించి తోటి పిల్లల నడుమ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



పూజలు చేస్తున్న భక్తులు

నడిగూడెం : మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయం వద్ద సోమవారం జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కళాశాలలో ప్లాంటేషన్ డే



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్లాంటేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గుంటుపల్లి శ్రీనివాస్, అధ్యాపకులు బ్రహ్మచారి, శ్రీనివాస్ రెడ్డి, రమణారెడ్డి, నాగుల్ మీరా, రమేష్, మహేష్, శోభారాణి, నరసింహారావు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.